ఏఎంసీలో వసతులు కరువు

జూలపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

జూలపల్లి, నవంబర్ 24 : జూలపల్లిలోని ఏఎంసీలో వసతులు లేక రైతులు, హమాలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఉత్పత్తులు విక్రయించేందుకు వచ్చిన రైతులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడి వ్యవసాయ మార్కెట్‌లో యాసంగి, వానా కాలంలో ప్రభుత్వం ధాన్యం కేంద్రం ఏర్పాటు చేస్తుంది. మార్కెట్‌లో విశ్రాంతి గదులు, తాగునీరు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు లేక హమాలీలు, రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక తాగునీరు అందుబాటులో లేక చెట్ల కింద సేదతీరుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకోడానికి రైతులు రాత్రి సమయాల్లో కుప్పలపై పడుకుంటున్నారు. చీకట్లో పాములు, తేళ్లు సంచరించడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మార్కెట్‌లో అన్ని వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కమాన్‌పూర్‌లో చోరీ

20 తులాల బంగారం, రూ. 2 లక్షల నగదు అపహరణ

కమాన్‌పూర్, నవంబర్ 24 : మండల కేంద్రంలోని పోస్టాఫీసు వీధిలో గల సాగి అంజలి నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 20 తులాల బంగారం, రూ. 2లక్షల నగదును చోరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటీవల అనారోగ్య రీత్యా అంజలి ఆపరేషన్ కోసం గత శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా మంచిర్యాలకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా, ఇంటి తలుపులు పగులగొట్టబడటంతో పాటు ఇంట్లోని బీరువాలు పగులగొట్టి అందులో ఉన్న బంగారంతో పాటు నగదును దొంగిలించినట్లు సదరు కుటుంబసభ్యులు గ్రహించారు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రసాద్ పరిసరాలను పరిశీలించారు.

ఎన్టీపీసీ ఈడీకి లీడర్ సీఈవో అవార్డు

జ్యోతినగర్, నవంబర్ 24: రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సౌత్ రీజినల్ ఈడీ కేదార్ రంజన్‌పాండుకు ప్రతిష్టాత్మకమైన లీడర్ సీఈవో అవార్డు లభించింది. శనివారం గోవాలో జరిగిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్ అవార్డుల ప్రధానోత్సవంలో 2024 కు గాను కేదార్ రంజన్‌పాండు ఉత్తమ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్(సీఈవో) అవార్డును అందుకున్నారు.

మార్కెట్ యార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయరూ..

ధర్మారం, నవంబర్ 11 : ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ట్రాన్స్ ఫార్మర్ లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యార్డులో ధాన్యం శుభ్రం చేసేందుకు 45 ప్యాడీ క్లీనర్లు ఉన్నాయి. కానీ, మార్కెట్ యార్డ్‌లో 11కేవీ విద్యుత్ సౌకర్యం మాత్రమే ఉండడంతో ప్యాడీ క్లీనర్లకు విద్యుత్ సరిపోవడం లేదు.. ధాన్యం శ్రుభం చేస్తుండగా తరుచూ ఫ్యూజులు కొట్టేస్తున్నాయి. అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న వారే లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, రైతుల ఇబ్బందులు తొలగించాలని వేడుకుంటున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- 28న కొత్తగూడెంలో సింగరేణి స్ట్రక్చర్ సమావేశం
- గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు సమస్యల స్వాగతం
- పరిష్కారం కోసం ఏడాదిగా కార్మికులు ఎదురుచూపు

సింగరేణి కార్మికులు

పెద్దపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులు 11 నెలలుగా ఎదురు చూస్తున్న స్ట్రక్చర్ మీటింగ్‌కు ఎట్టకేలకు తేదీ ఖరారైంది. ఈ నెల 28న కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో సమావేశం జరగనున్నది. గతేడాది డిసెంబర్ 28న ఎన్నికలు జరగగా.. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ గెలుపొందాయి. మూడు నెలలకోసారి సమావేశాలు జరగాల్సి ఉన్నది. కానీ, 11 నెలలైనా ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్ సమావేశాలు, జేసీసీ సమావేశాల ఊసేలేదు. స్ట్రక్చర్ సమావేశంలో తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. సింగరేణి ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చే విధంగా కార్యాచరణను సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్ట్రక్చర్ సమావేశాలే ప్రధానం

ప్రతి మూడు నెలలకోసారి స్ట్రక్చర్ సమావేశం నిర్వహించడం ద్వారా కార్మికుల సమస్యలను అందులో ప్రస్తావించే అవకాశం ఉంటుంది. జేసీసీ సమావేశాలు నిర్వహిస్తే అందులో మరికొన్నింటిని యాజమాన్యం దృష్టికి తీసుకురావచ్చు. స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం, యాజమాన్యం ప్రతినిధులు, జేసీసీ సమావేశంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు, యాజమాన్యం నుంచి అధికారులు పాల్గొంటారు. ఇరుపక్షాల సమక్షంలో ప్రతి సమస్యను చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎట్టకేలకు స్ట్రక్చర్ మీటింగ్ జరగనుండడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని సింగరేణి కార్మికులు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఆలస్యంగా ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు

సింగరేణి ఎన్నికల్లో గెలిచిన సంఘాలు వెంటనే గుర్తింపు పత్రాలను పొందకుండా నాలుగేళ్ల పదవీకాలం కావాలని కోరుతూ పత్రాలను అందుకోవడంలో జాప్యం చేశారు. ఆలస్యంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పత్రాలను అందుకున్నారు. ఇందుకోసం తొమ్మిది నెలలపాటు వేచి చూడాల్సి వచ్చింది. సెప్టెంబర్ 9న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు అధికారిక పత్రాలు అందుకున్నారు. ఈ జాప్యంతో స్ట్రక్చర్ సమావేశాలపై గుర్తింపు సంఘం, యాజమాన్యం దృష్టి పెట్టలేదు. దీంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిష్కరించాల్సిన సమస్యలివే..

- లాభాల వాటా, దీపావళి బోనస్ ఒక ప్రత్యేక వాటాగా చేయాలి. రూ.12లక్షల కంటే ఎక్కువగా ఉన్నవాళ్లకు మాత్రమే ఇన్‌కం టాక్స్ 5శాతం పడేలా చూడాలి.
- భూగర్భ గనుల్లోని వెంటిలేషన్‌తోపాటు కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న కేడర్ స్కీం పదోన్నతులు పరిష్కరించాలి.
- పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేసి. కార్మికులకు ఉద్యోగోన్నతి కల్పించాలి.
- సొంతిల్లు కోసం 250గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వరకు వడ్డీ లేని రుణాలివ్వాలి.
- హెల్త్‌కార్డు ప్రతి కార్మికునికి ఇచ్చి.. ఎక్కడ చూపించుకున్నా వర్తించేలా ఉండాలి.
- విజిలెన్స్ విచారణ పేరుతో నిలిపివేసిన వారసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలి.
- అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మెడికల్ ఇన్వాలిడేషన్ చేయాలి.
- కొత్త గనుల ఏర్పాటుపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి.
- 2వేల మీటర్ల కంటే ఎక్కువ డెప్త్‌లో దిగే అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ మైన్‌లో పని చేసే ప్రతి కార్మికుడికి స్పెషల్ అలవెన్స్ ఇవ్వాలి.
- జనవరి 1న 190/240 మాస్టర్స్ అయినవాళ్లకు ఎస్ఏపీలో అప్డేట్ చేయాలి. జనరల్ మజ్దూర్ లేటర్స్ కూడా ఎస్ఏపీలో డౌన్‌లోడ్ చేసుకునేలా ఉండాలి.
- ప్రస్తుతం పెరిగిన గ్యాస్, పెట్రోల్ ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలి.
- కార్మికులు దురదృష్టవశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి రూ.60లక్షల పరిహారం అందేలా చూడాలి.
- ఎల్‌టీసీలో డబ్బులు కాకుండా రైల్వే వాళ్లతో ఎంవోయూ చేసుకొని కుటుంబంతో వారం రోజులు 3ఏసీలో సౌత్/నార్త్/భారత మాల/స్పెషల్ టూర్స్ ప్యాకేజ్ ఇవ్వాలి.
- ఎక్కడి ఏరియా వారికి అక్కడే వన్ టైం సెటిల్ మెంట్ కింద ట్రాన్స్‌ఫర్ చేయాలి.
- నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలి.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఎస్‌సీసీఎల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ హౌసింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయాలి.
- కార్మికుడు మరణిస్తే అంతిమయాత్రను కంపెనీ అధికార లాంఛనాలతో గౌరవంగా ఆర్మీలో తరహాలో ఎఅండ్‌పీసీతో చేయించాలి.
- కాడర్ స్కీం, ప్రమోషన్ విషయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
- కార్మికులకు సరిపడా పనిముట్లు సరఫరా చేయాలి.

ఐటీ మినహాయింపు లేనట్టే?

- సింగరేణి కార్మికులకు ఉత్తదైన కాంగ్రెస్ సర్కారు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల హామీ
- ఆదాయ పన్ను ఎంపిక ఆప్షన్లకు ఈ నెల 26 చివరి తేదీ

పెద్దపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సింగరేణి కార్మికులకు ఇక ఐటీ మినహాయింపులు ఈ ఏడాది కూడా లేనట్టే అనేది స్పష్టమవుతున్నది. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ, సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ ఇచ్చిన ఆదాయ పన్ను మినహాయింపు హామీ అటకెక్కింది. 2023-24 సంవత్సర ఆదాయ పన్ను ఈ ఏడాది అక్టోబర్ నెల మాసంలో సింగరేణి ఉద్యోగుల వేతనం నుంచి కట్ అయ్యింది. గతేడాది జీతాల్లో ఆదాయ పన్ను వసూలు చేయగా.. తాజాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీ ఆప్షన్లకు సైతం సింగరేణి యాజమాన్యం ఈ నెల 26న చివరి తేదీగా ప్రకటించడంతో వచ్చే 2025 అక్టోబర్‌లో సైతం ఆదాయపన్ను భారం సింగరేణి కార్మికులపై పడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపుగా 42 వేల మంది సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను మినహాయింపునకు హామీ ఇచ్చినా.. గత డిసెంబర్‌లో కాంగ్రెస్ సర్కారు కొలువు దీరినా.. 11 నెలల క్రితం సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ ఎన్నికైనా కార్మికుల సమస్యలు మాత్రం తీరడం లేదు. అక్టోబర్ మాసం వేతనాల నుంచి అధిక మొత్తంలో ఐటీ కోతలు కోశారు. దీంతో సింగరేణి కార్మిక వర్గం బెంబేలెత్తింది. సుమారు మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు ఐటీ పేరిట పాలక ప్రభుత్వాలు కార్మికుల వేతనాల నుంచి కోతలు విధిస్తుడడంతో కొత్త ప్రభుత్వంపై, కొత్త గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలపై కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాశలే అయ్యాయి. ఎన్నికల సమయంలో కార్మికులను బార్డర్‌లో సిపాయిలతో పోల్చుతూ, కార్మిక శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామని చెప్పిన రాజకీయ పార్టీల ప్రచారం ఎన్నికల వరకే పరిమితమవుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు ఐటీ వేతనాల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ అది సాధ్యం కాలేదు. అయితే, ఆదాయ పన్ను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర శాసన సభ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. కేంద్రం ఏ మాత్రం చొరవ చూపకపోవడంతో అది అక్కడే నిలిచిపోయింది. అయితే, కాంగ్రెస్ సర్కారు కొలువు దీరిన తర్వాత ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి విజ్ఞప్తులు.. వినతి పత్రాలు సమర్పించకపోగా.. అసలు ఆదాయ పన్ను మినహాయింపుపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కార్మికులను బార్డర్‌లో సైనికులతో పోల్చినప్పుడు వారికి కల్పించినట్టు కార్మికులకు సైతం ఐటీ కోతల నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ కార్మిక వర్గం నుంచి బలంగా వినిపిస్తోంది. గత 11వ వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు కాస్త పెరిగిన ప్పటికీ ఆ ఫలాలు పూర్తి స్థాయిలో కార్మిక వర్గానికి అందకుండా, వివిధ రకాల కోతల రూపంలో మళ్లీ తిరిగి ప్రభుత్వాలకే చేరుతుండడం గమనార్హం. గత నెల సింగరేణి బొగ్గు గని కార్మికులకు బోనస్‌ల పేరిట కొంత మొత్తంలో లబ్ధి చేకూరిందని ఇటు సింగరేణి యాజమాన్యం అటు, కాంగ్రెస్ ప్రభుత్వాలు జోరుగా ప్రచారం నిర్వహించి, గత నెల నుంచి అధిక మొత్తంలో కార్మికుల వేతనాలు నుంచి ఐటీ పేరిట కోతలు పెడితే, ఎందుకు ప్రచారం నిర్వహించడం లేదని కార్మిక వర్గం ప్రశ్నిస్తున్నది. ఆదాయ పన్నుపై కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి మినహాయింపు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఆదాయ పన్నుపై పెదవి విప్పకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదాయ పన్ను ఎంపిక ఆప్షన్లకు ఈ నెల 26 చివరి తేదీ..

సింగరేణి కార్మికులు, ఉద్యోగుల ఆదాయ పన్ను ఆప్షన్ల ఎంపికకు సింగరేణి సంస్థ ఈ నెల 26 వరకు చివరి గడువును విధించింది. ప్రతీ ఉద్యోగి తన వేతనంలో ఆదాయ పన్ను చెల్లింపునకు ఆప్షన్ ఎంపిక చేసుకునేందుకు తుది గడువు విధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆప్షన్-1, ఆప్షన్-2లలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇప్పటికే ఈ రెండు ఆప్షన్లలో ఏదో ఓ ఆప్షన్‌ను ఎంచుకున్న వారు సైతం మార్చుకునే అవకాశం ఉండగా.. ఆప్షన్‌ను మార్చుకోని పక్షంలో పాత ఆప్షన్‌లోనే ఆదాయ పన్ను పడనుంది. ఏ ఆప్షన్ ఎంపిక చేసుకోని ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి కొత్త ఆప్షన్‌లోనే ఐటీ రికవరీ చేయనున్నారు.

ఆదాయ పన్ను పాత విధానం(ఆప్షన్-1)/కొత్త విధానం(ఆప్షన్-2) ఉదాహరణకు తేడాలు ఇలా..

ఒక కార్మికుడి నుంచి	పాత విధానం(ఆప్షన్-1)	కొత్త విధానం(ఆప్షన్-2)	తేడా ఇలా
సంవత్సర ఆదాయం (ఒక కార్మికుడి ఆదాయం)	19,00,000	19,00,000	0
అండర్ సెక్షన్ 80సీ	రూ.-1, 50, 000	0	0
ఇంటి రుణం వడ్డీ	రూ. -1, 50, 000	0	0
స్టాండర్డ్ డిడక్షన్	రూ.- 50, 000	రూ.-75, 000	0
మొత్తం	రూ.15,50, 000	రూ.18,25,000	
ఆదాయ పన్ను చెల్లించేది	రూ.2,88, 600	రూ.2,47, 000	41, 600

ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు



పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అంతకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

స్కోర్ పెంపునకు మార్గాలు

సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.



గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టం లోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

ఒడిదొడుకుల్లోనే పయనం

దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సె